మర్రిచెట్టే ప్రయాణికులకు బస్టాండ్

దిలావర్‌పూర్‌లో బస్టాండ్ లేక చెట్టు కింద నిలబడి బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ), మంజులాపూర్ గ్రామాల్లో బస్టాండ్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ.. వర్షానికి తడవాల్సి వస్తుంది. దిలావర్‌పూర్‌లో ఎండ నుంచి రక్షించుకునేందుకు బస్టాండ్ లేక ప్రయాణికులు మర్రిచెట్టు కింద బస్సుల కోసం నిలబడాల్సి వస్తుంది. వర్షం కురిస్తే హోటల్లో నిలబడుతున్నారు. సౌకర్యాలు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– దిలావర్‌పూర్, ఫిబ్రవరి 9

ప్రారంభించారు.. కొనుగోళ్లు మరిచారు

కంది రైతుల ఆందోళన

మార్కెట్‌లో రైతులు కుప్పగా పోసిన కందులు

బోథ్, ఫిబ్రవరి 9 : బోథ్ మార్కెట్ కమిటీ యార్డులో ప్రభుత్వ రంగ సంస్థలైన నాఫెడ్, మార్కెఫెడ్ ఆధ్వర్యంలో జనవరి 31వ తేదీన కందుల కొనుగోళ్లు ప్రారంభించారు. పది రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత జూన్, జూలై నెలల్లో కంది పంట ప్రస్తుతం రైతుల చేతికొచ్చింది. పంట ఉత్పత్తులను రైతులు అమ్మడానికి కోసం సిద్ధం చేసి ఉంచారు. బహిరంగ మార్కెట్‌లో ధర రూ.6900 నుంచి రూ.7200 మాత్రమే పలుకుతున్నది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7550 ఉండడంతో రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్ముకోవడానికి సిద్ధం ఉన్నారు. మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డితో పాటు సహకార సంఘం అధికారులు జనవరి 30న మార్కెట్ యార్డులో కందుల కొనుగోలును లాంఛనంగా ప్రారంభించారు. పది రోజులు గడుస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదు. గన్నీ బ్యాగుల కొరతతో కొనుగోలు ప్రారంభించనట్లుగా తెలుస్తున్నది. మార్కెఫెడ్ వారు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని వెంటనే కొనుగోలు మొదలు పెట్టాలని కంది రైతులు కోరుతున్నారు.

జీసీసీ గోదాంలో అగ్నిప్రమాదం

- రూ.25లక్షల నష్టం

ఉట్నూర్, ఫిబ్రవరి 9: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గల జిల్లా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) గోదాంలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఫైర్ ఇంజిన్ వచ్చేలోపే భారీగా మంటలు అంటుకున్నాయి. రాత్రి వరకు సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దాదాపు రూ.25 లక్షల విలువైన తట్టు సంచులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయని జీసీసీ గోదాం క్లర్క్ చందులాల్ పేర్కొన్నారు. జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న డీఆర్‌డిపోలకు సప్లయ్‌లో భాగంగా గోనె సంచులు కొనుగోలు చేసి గోదాంలో ఉంచినట్లు పేర్కొన్నారు. ఇంతలో భారీ అగ్నిప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

అగ్నికి ఆహుతి అవుతున్న జీసీసీ గోదాం

నులిపురుగు నివారణ దినోత్సవం వాయిదా

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 9 : ఈ నెల 10వ తేదీన నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతరత్రా కారణాల వల్ల కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంనిర్వ హించే తేదీ త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

కుంటాల, ఫిబ్రవరి 9 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని వెంకూర్ గ్రామంలో రైతులు బాజీరావ్, ఆడెపు రాజేశ్వర్, కాంతారావ్, మనోహర్ పటేల్‌కు చెందిన చేరో అర ఎకరం వరకు మొక్కజొన్న పంటను శనివారం అర్ధరాత్రి అడవి పందుల ధ్వంసం చేశాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించిఆ దుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉత్తర తెలంగాణను అభివృద్ధి చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 9: ఉత్తర తెలంగాణ అభివృద్ధికి నోచుకోవడం లేదని ఉత్తర తెలంగాణ అభివృద్ధి ఫోరం చైర్మన్ డాక్టర్ బీ కేశవులు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో నార్త్ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం మొట్ట మొదటి ఉత్తర తెలంగాణ అభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదిలాబాద్ నీరు, ఖనిజ సంపదతో పాటు వనరులున్న అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రతి జిల్లాకు రూ.20 వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించి, ఉత్తర తెలంగాణను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్లు తాళ్ల రవీందర్, విఠల్, మాధవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సాజిద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డీఎల్ఎన్ చారి, సితార్ల సురేశ్, గోపాల్ రెడ్డి, పోశెట్టి, అంకం జగదీశ్, రమేశ్, సంతోష్, బామన్ జగన్, వెంకటనారాయణ, సాయన్న, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమణలను తొలగించాలి

బేల, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలం బుర్నూర్‌లోని సర్వే నంబర్ 29/ఏలో అక్రమంగా లేఔట్లు వేసి విచ్చలవిడిగా భవనాలు, గుడిసెలు నిర్మిస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడె శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లో ఆదివాసీ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 సంవత్సరం తర్వాత వేసిన గుడిసెలను వెంటనే పంచాయతీ శాఖ వారు తొలిగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాయి సెంటర్ సార్‌మేడి చాందపల్లి కొరంగే సోనేరావ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు సిడాం నందుకుమార్, ఆదివాసీ నాయకులు సంతోష్, నైతం సీతారాం, పెందూర్ రాందాస్, మాజీ ఎంపీటీసీలు అరుణ, సాకారం, శ్యాంరావ్, రవీందర్, హన్మంతు, మారుతి పాల్గొన్నారు.

బోథ్‌లో 5.09 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు

బోథ్, ఫిబ్రవరి 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో ఆదివారం వరకు 5,09,860.81 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. 31,413 మంది రైతులకు చెందిన పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో 590534.84, ప్రైవేట్ వ్యాపారులు 19325.97 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. సీసీఐలో బోథ్‌లోని స్వప్న జిన్నింగ్ మిల్లులో 72544.71, రాఘవేంద్రలో 74771.14, సాయిదత్తలో 75566.86, పొచ్చెరలోని సాయిబాబాలో 82846.60, నేరడిగొండలోని దర్శన్‌లో 86755.39 సొనాలలో గురుసాహెబ్ చందలో 98050.14 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన బొలేరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కుభీర్, ఫిబ్రవరి 9: కుభీర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బొలేరో పికప్ వాహనం, బైకు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. నందపహాడ్‌కు చెందిన రాథోడ్ సంతోష్, ఆయన మిత్రుడు బైక్‌పై లింగేశ్వర్ పార్డి(బీ) వైపు నుంచి కుభీర్ వస్తుండగా కుభీర్ నుంచి భైంసా వైపు వెళ్తున్న బొలేరో పికప్ వాహనం ముందు వైపు నుంచి వేగంగా ఢీ కొట్టింది. బైక్‌పైనున్న రాథోడ్ సంతోష్, లింగేశ్వర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రైవేట్ వాహనంలో భైంసా దవాఖానకు తరలించారు. డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 9: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. ఆదివారం నిర్మల్‌లోని పీఆర్టీయూ సంఘ భవనంలో యూనియన్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. యూనియన్ జండా ఎగురవేసి ఎనిమిది మంది విశ్రాంత కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు గజ్జారాం, మోహన్, పరమేశ్వర్‌రెడ్డి, సిద్ధిరామ్, విజయ్‌కుమార్, సదానందం, శంకర్, భూమారెడ్డి, కృష్ణ, శేఖర్, రఘునాథ్, పరమేశ్వర్, రాజన్న, చింతమోహన్,గం గాచరణ్ పాల్గొన్నారు.

భైంసా, ఫిబ్రవరి 9 : భైంసాలోని పీఆర్టీయూ భవనంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వివిధ హోదాల్లో సంఘానికి , విద్యారంగానికి సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, నరేందర్, శివరాం, మల్లికార్జున్, హైమద్‌ఖాన్, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

నిర్మల్‌అర్బన్:ఒ కేవేది కపైకలి సినగురు వులు,పూ ర్వ విద్యార్థులు



పెంబి: 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 9 : నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003-06లో ఎంపీసీ, ఎంపీసీఎస్ చదివిన విద్యార్థులు ఉత్సవ్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు.

పెంబి, ఫిబ్రవరి 9: నిర్మల్ జిల్లా పెంబి ప్రభుత్వ పాఠశాలలో 1995-96 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను శాలువాతో సన్మానించారు. వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ. 10 వేలు విరాళం అందజేశారు.

తాంసి, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సర పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మరణించిన తోటి స్నేహితులను స్మరించుకుని మౌనం పాటించారు. అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. పాఠశాలలో నీటి సమస్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని వారు రూ.15 వేల విలువ గల మోటార్ పంపు సెట్, ఇతర వస్తువులను అందజేసి నీటి సమస్యను పరిష్కరించారు.

ఉట్నూర్, ఫిబ్రవరి 9: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివిన 1991-92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు.

ఇచ్చోడ, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 1972-73 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు పోశెట్టిని శాలువాతో సన్మానించారు.

ఇచ్చోడ: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తాంసి: కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో2004-05 బృంద విద్యార్థులు



ఉట్నూర్: 1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు సాజీదుద్దీన్

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సాజీదుద్దీన్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులను ఆన్‌లోన్‌లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వెంటనే ఆప్షన్ తీసివేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో మోసపూరిత మాటలను పసిగట్టి అక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు గుండుసున్న ఇవ్వడం జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రేషన్ కార్డు ఇచ్చిన హామీకి సంబంధించిన వీడియోను చూపించారు. ప్రజాపాలన పేరుతో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఇండ్ల స్థలాలు అందిస్తామని దరఖాస్తులు ప్రజల నుంచి తీసుకొని ఒక్కటి కూడా పూర్తి చేయకుండా ప్రజలను మభ్యపెట్టిందన్నారు. ఎన్నికలు ముందు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల కోడ్ సాకుతో మరోసారి ఓట్లు రాబట్టే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మోసానికి తెరలేపుతుందన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు ఇజ్జగిరి అశోక్, కుమ్ర రాజు, దాసరి రమేశ్, దయానంద్, ఫేరోజ్, రాజ్, సిదార్థ్ పాల్గొన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా కల్పించేందుకు ప్రభుత్వానికి విన్నవిస్తాం

మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు విలాస్ రావ్‌పాటిల్

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : తెలంగాణలో మాలీలకు ఎస్టీ హోదా కల్పించేందుకు ప్రభుత్వానికి విన్నవిస్తామని మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు విలాస్‌రావ్ పాటిల్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని యాదవ సంఘ భవనంలో మాలీ సంఘం మహా సమ్మేళనం నిర్వహించారు. చిన్నారులు జ్యోతి బా పూలేను కీర్తిస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు విలాస్‌రావ్ పాటిల్ మాట్లాడుతూ ఏపీలో మాలీలు ఎస్టీగా కొనసాగుతున్నారని, కానీ తెలంగాణలో మాత్రంలో ఎస్టీ హోదా లేదన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఆడ పిల్లల చదువుకు కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రి బాయి ఫూలేల జీవిత చరిత్రలను పాఠ్యం శాల్లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు డాక్టర్ శ్యాంరావ్ పూలే, న్యాయవాదులు కైలాష్ వాగేల, రాజేందర్ మహాడోలే, సుకుమార్ పెట్కులే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, ఉపాధ్యక్షుడు సురేశ్ గుర్నూలే, కోశాధికారి సతీశ్ గుర్నూలే, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వినోద నగోషే, జిల్లా అధ్యక్షురాలు ఉజ్వల ఉమేశ్‌రావ్ డోలే, యువజన విభాగం అధ్యక్షుడు నందకిశోర్ పాల్గొన్నారు.

కటా ఈవెంట్‌లో విద్యార్థులకు బంగారు పతకాలు

బంగారు పతకాలతో వేదిక్ విద్యార్థులు

సోన్, ఫిబ్రవరి 9: నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామంలోని వేదిక్ పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు కరాటే, కటా ఈవెంట్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో గెలుపొంది బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ మామిళ్ల లింగయ్య, కరస్పాండెంట్ సంజన తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆల్ మార్షల్ ఆర్ట్స్ లెజెంట్ సినీ హీరో భానుచందర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించడంతో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ నరేశ్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

ఆందోళనచేస్తున్న మాల సంఘం నాయకులు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 9: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. అరగంటపాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండలాధ్యక్షుడు మెట్టు ప్రసాద్, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాలలు పాల్గొన్నారు.

ముగిసిన దర్గా ఉర్సు

దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థన చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టీ)లోని రాజన్ వలి దర్గా ఉర్సు ఉత్సవాలు ముగిశాయి. ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శనివారం అర్ధరాత్రి ముగియగా... ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి గాయకులు రాజన్ షా వలీని కీర్తిస్తు ఖవ్వాలి పాడుతూ ఉత్సాహ పరిచారు. మాజీ మంత్రి జోగు రామన్న ఉత్సవాల చివరి రోజు దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ అధ్యక్షుడు అశ్రఫ్, నాయకులు పాల్గొన్నారు.

పాత కక్షలతో కారు ధ్వంసం

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : పాత కక్షలు కారణంగా కారును బండరాయితో ధ్వంసం చేసిన ఘటన ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌లోని చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ మైముద్ హైమద్‌కు చెందిన కారును అదే కాలనీకి చెందిన ఫారొఢీఖాన్ బండరాయితో కారును ధ్వంసం చేశాడు. ఆదివారం షేక్ మైముద్ హైమ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు.

ఆటో బైక్ ఢీ : ముగ్గురికి గాయాలు

తాంసి, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని వడ్డాడి ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఆటో బైక్ ఢీ కొనగా ముగ్గురికి గాయాలయ్యాయి. తాంసి నుంచి ఆటోలో ఇద్దరు, బైక్ పైన ఇద్దరు కూరగాయలు అమ్మడానికి ఆదిలాబాద్‌కు వెళ్తున్నారు. వడ్డాడి ఎక్స్ రోడ్ వద్ద పశువు అడ్డం రావడంతో ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఈఎంటీ వంశీ, పైలెట్ పొచ్చన్న అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

నార్నూర్, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి జ్ఞానోబాపుష్కర్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సీఐ రహీం పాషా తెలిపిన వివరాల ప్రకారం...జ్ఞానోబాపుష్కర్ దంపతులు విహారయాత్ర నిమిత్తం వెళ్లారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాను పగలుగొట్టి రూ.2లక్షలు చోరీ చేశారు. ఆయన కుమారుడు రాహుల్ పుష్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : మద్యానికి బానిసై ఇంట్లో ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో చింతల రుకుమ్‌బాయి కొడుకు గణేశ్(25) కలిసి ఉంటున్నారు. మూడు సంవత్సరాల క్రితం భార్యతో విడాకులై తల్లి వద్దే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన గణేశ్ తరచుగా తల్లిని డబ్బులు అడిగేవాడు. శనివారం రాత్రి తల్లిని డబ్బులు అడగగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదే కాలనీలో నివాసముంటున్న రుకుంబాయి చెల్లి ఇంటికి వెళ్లింది. మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక సేవలో రాణించాలి



నూతన కార్యవర్గం సభ్యులతో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : వృత్తితో పాటు సామాజిక సేవలో డెంటల్ అసోసియేషన్ సభ్యులు రాణించడం అభినందనీయమని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ఓ బ్లాంకెట్ హాల్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, గౌరవాధ్యక్షులు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ కళ్యాణ్ రెడ్డి హాజరయ్యారు. ఐడీఏ అధ్యక్షుడిగా సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా చిన్మయ్ వజే, కోశాధికారి డాక్టర్ సజీవ్ కుమార్, ఈసీ సభ్యులుగా డాక్టర్ ఆరె చంద్రకాంత్, డాక్టర్ ఫైసల్ అక్బానీ, డాక్టర్ అమూల్య కొల్లూరి, డాక్టర్ అరుణ్ బాదవత్, డాక్టర్ వినోద్ బల్లా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం డీఎంహెచ్‌వోతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డాక్టర్లు ప్రమోద్ రెడ్డి, సమీయొద్దీన్ పాల్గొన్నారు.

వృత్తిదారులు ఆర్థికంగా బలోపేతం చెందాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : చేతివృత్తిదారులు పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం చెందాలని బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో ఏడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న స్వర్ణకారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్వర్ణకారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం, శిక్షకులు ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

అంధకారంలో పురవీధులు



వెలగని విద్యుత్ దీపాలు

తాంసి, ఫిబ్రవరి 9: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో నాలుగు రోజులుగా పుర వీధులు అంధకారంలో ఉన్నాయి. ఇటీవల 11కేవీ విద్యుత్ లైన్లపై చెట్లు పడడంతో గ్రామంలోని విద్యుత్ దీపాలు పని చేయకపోవడంతో వెలగడం లేదని స్థానికులు తెలిపారు. గ్రామంలోని వీధులన్నీ అంధకారంలో ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. లైన్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని వాపోయారు. వెంటనే సమస్యను పరిష్కరించి గ్రామంలోని పురవీధుల్లో వెలుగులు నింపాలని స్థానికులు కోరుతున్నారు.

కలపను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

కుంటాల, ఫిబ్రవరి 9 : నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబుగాం శివారులోని వ్యవసాయ క్షేత్రంలో చెట్లను ఓ పట్టాదారు రైతు వ్యాపారికి విక్రయించాడు. సదరు వ్యాపారి అటవీ శాఖ అనుమతితో ఆ పట్టా భూమిలోని చెట్లను నరికివేసి రవాణా చేస్తున్నారు. ఇదే క్రమంలో మెదన్‌పూర్ గ్రామస్తులు శనివారం రాత్రి అడ్డుకొని ప్రశ్నించారు. అనుమతి పత్రంలో తేదీ కొట్టివేసినట్లు ఉండడాన్ని తప్పుపట్టారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని నిర్మల్ డీఎఫ్ఓకు వివ